
నేటి నుంచి టీజీ ఎప్‌సెట్ రెండో విడత కౌన్సెలింగ్

నిజామాబాద్ అర్బన్, జూలై 25: ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశాల కోసం టీజీ ఎప్‌సెట్-2024 రెండో విడత కౌన్సెలింగ్ ఈనెల 26 నుంచి ప్రారంభం కానున్నట్లు జిల్లా సమన్వయకర్త శ్రీరాం కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. స్లాట్ బుకింగ్ అనంతరం అభ్యర్థులు ఈనెల 27 నుంచి ఎంపిక చేసిన హెల్ప్‌లైన్ సెంటర్‌లలో సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకావాలన్నారు. ఈనెల 27, 28 తేదీలలో వెబ్ ఆప్షన్లు ఎంచుకోవచ్చన్నారు. ఈ నెల 31లోగా సీట్ల కేటాయింపు ఉంటుందని ఆయన తెలిపారు.



రైతుకు బాసట

- బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి అధిక నిధుల కేటాయింపు
- నిజాంషుగర్ ఫ్యాక్టరీని పునరుద్ధరిస్తామని ప్రకటన
- ఇందిరమ్మ ఇళ్లకు బడ్జెట్‌లో నిధుల కేటాయింపు
- తెలంగాణ విశ్వవిద్యాలయానికి రానున్న నిధులు
- ఆరోగ్యశ్రీ పరిమితి పెంపుతో జిల్లా రోగులకు మేలు

నిజామాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం ఇచ్చింది. ఎన్నికల హామీల మేరకు నిధులను ఎక్కువగా కేటాయించింది. రైతు అభివృద్ధే ధ్యేయంగా బడ్జెట్‌లో అత్యధిక నిధులను కేటాయించింది. ఇచ్చిన హామీలో భాగంగా నిజాంషుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని ప్రకటించడంతో పాటు త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని బడ్జెట్‌లో ప్రకటించారు. వ్యవసాయ రంగానికి ఊతమిచ్చే విధంగా ఆయిల్ పామ్ సాగుకు ప్రోత్సాహం ఇవ్వడంతో పాటు వరి సాగు చేసే రైతులకు బోనస్‌ను ప్రకటించారు. రుణమాఫీ, రైతుభరోసాతో పాటు ఉద్యానవన పంటలకు కూడా అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు బడ్జెట్‌లో పొందుపర్చారు. వ్యవసాయంతో పాటు విద్య, సంక్షేమానికి కూడా నిధులను కేటాయించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ప్రతి నియోజకవర్గానికి 3500 ఇళ్లను ఇస్తున్నట్లు బడ్జెట్‌లో పొందుపర్చారు. ఎస్సీ, ఎస్టీలతో పాటు అన్ని వర్గాలకు ఇండ్లను మంజూరు చేయనున్నట్లు ప్రకటించారు. ఉన్నత విద్యకు ప్రాధాన్యం ఇస్తూనే విశ్వవిద్యాలయాల్లో మౌలిక వసతుల కోసం నిధులను కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ఆరోగ్యశ్రీ పరిమితి 10 లక్షలకు పెంచడంతో పాటు డ్వాక్రా మహిళలకు 10లక్షల ఇన్సూరెన్స్‌ను ప్రకటించడం వల్ల జిల్లాలోని ఎక్కువ మందికి ఈ పథకాలు ఉపయోగపడనుంది. ఆరోగ్యశ్రీ పరిమితి పెంచడం వల్ల ఎంతో మంది రోగులకు మేలు జరగనుంది. మొత్తంగా బడ్జెట్ ఎన్నికల హామీలకు అనుగుణంగా కేటాయింపులు చేయగా అధికార పార్టీ నేతలు అన్ని వర్గాలకు ఈ బడ్జెట్ ఉపయోగపడుతుందని ప్రకటించగా ప్రతిపక్ష పార్టీల నేతలు మాత్రం ప్రజల సంక్షేమాన్ని విస్మరించారని ఆరోపించారు.

పదేళ్ల తర్వాత..

పదేళ్ల తర్వాత తిరిగి అధికారాన్ని చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం తొలిసారిగా వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్‌ను గురువారం రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క శాసనసభలో ప్రవేశ పెట్టారు. రాష్ట్ర బడ్జెట్‌ను రూ.2లక్షల 91వేల159 కోట్లుగా ప్రకటించారు. ఆయా రంగాలకు కేటాయించిన నిధులను ప్రకటించారు. వ్యవసాయం, సంక్షేమం, సాగునీటి ప్రాజెక్టులు, గ్రామ పంచాయతీలు, రోడ్లు, వైద్య ఆరోగ్యం, విద్య, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమంతో పాటు ఇతర శాఖలకు కేటాయించిన నిధులను ప్రకటించారు.

నిజాంషుగర్ ఫ్యాక్టరీపై ప్రకటన..

జిల్లాలోని నిజాంషుగర్ ఫ్యాక్టరీని త్వరలోనే తెరిపిస్తామని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అసెంబ్లీలో ప్రకటించారు. బోధన్‌తో పాటు మెదక్, మెట్‌పల్లిలోని ఫ్యాక్టరీలను తెరిపించడంతో పాటు చెరుకు రైతులకు అండగా ఉంటామని ఆయన ప్రకటించడం వల్ల కార్మికులతో పాటు రైతులకు మేలు జరిగే పరిస్థితి ఉంది. ఈ ఫ్యాక్టరీ మూతబడి ఎనిమిదేళ్లు దాటి పోవడం వల్ల రైతులు ఎంతగానో ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం బడ్జెట్ ప్రసంగంలో కూడా ప్రకటించడం వల్ల మళ్లీ ఫ్యాక్టరీని పునరుద్ధరిస్తే చెరుకు సాగు పెరగనుంది. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ఇళ్ల నిర్మాణానికి అవకాశం ఇస్తామని బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి ప్రకటించారు. ఈ సంవత్సరం ప్రతి నియోజకవర్గంలో 3500 ఇళ్ల నిర్మాణం చేపడతామని ప్రకటించారు. ప్రతీ ఇంటి నిర్మాణానికి 5లక్షల రూపాయలు కేటాయిస్తామన్నారు. ఈ పథకం కింద జిల్లాలోని ఆరు నియోజకవర్గాలకు కలిపి 19250 ఇళ్లు రానున్నాయి.

వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం..

ఈ బడ్జెట్‌లో అత్యధికంగా వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారు. బడ్జెట్‌లో ఆ శాఖకు 72,659 కోట్ల రూపాయల నిధులను కేటాయించారు. రైతులకు 2లక్షల రుణమాఫీతో పాటు రైతుభరోసా కోసం నిధులను కేటాయిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 2లక్షల 70వేలకు పైగా రైతులు ఉన్నారు. ఇప్పటికే రుణమాఫీ అమలు చేయడం వల్ల సుమారు 60వేల మందికి పైగా మేలు జరిగింది. లక్ష రూపాయలలోపు రుణం మాఫీ అయింది. రెండు లక్షల రూపాయలలోపు రుణం మాఫీ అయితే లక్షన్నర మందికి పైగా రైతులకు మేలు జరగనుంది.

రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో మౌలిక వసతుల కోసం ప్రభుత్వం 500 కోట్లను కేటాయించింది. దీంట్లో 200 కోట్ల రూపాయలు ఉస్మానియా, మహిళా విశ్వవిద్యాలయాలకు కేటాయించగా, మిగతా 300 కోట్లను ఇతర విశ్వవిద్యాలయాలకు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. తెలంగాణ విశ్వవిద్యాలయానికి కూడా సుమారు 30 నుంచి 40 కోట్ల రూపాయల వరకు కేటాయింపులు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నిధులు విడుదల చేస్తే విశ్వవిద్యాలయంలో మౌలిక వసతులకు ఉపయోగపడనుంది. సాగునీటి ప్రాజెక్టులకు బడ్జెట్‌లో 22,301 కోట్లు కేటాయించారు. జిల్లాలోని ప్రాణహిత-చేవెళ్ల ప్యాకేజీలైన 20, 21లకు కూడా ఎక్కువ మొత్తంలో నిధులు వస్తాయని ఇరిగేషన్ అధికారులు భావిస్తున్నారు. కాళేశ్వరం పథకం కింద ఈ పనులు కొనసాగుతుండగా 20వ ప్యాకేజీ పనులు చివరిదశలో ఉన్నాయి. ప్రభుత్వం ప్రాధమిక క్రమంలో నిధులు కేటాయిస్తే ఈ ఏడాది ఈ ప్యాకేజీ పనులు మొత్తం పూర్తయ్యే అవకాశం ఉంది.

దశ దిశను మార్చే విధంగా రాష్ట్ర బడ్జెట్..

:మానాల మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు



రాష్ట్ర బడ్జెట్ దశ దిశను మార్చే విధంగా ఉంది. గత ప్రభుత్వం హయాంలో సంక్షేమం, వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వలేదు. ఇచ్చిన హామీల మేరకు బడ్జెట్‌లో అన్ని రంగాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని నిధులను కేటాయించారు. రైతులకు ఇచ్చిన హామీల మేరకు బడ్జెట్‌లో అత్యధికంగా వ్యవసాయ రంగానికి నిధులను కేటాయించారు.

బడ్జెట్ నిరాశ పరిచింది..

:వేముల ప్రశాంత్‌రెడ్డి, బాల్కొండ ఎమ్మెల్యే



రాష్ట్ర బడ్జెట్ నిరాశ పరిచింది. ఏ రంగాన్ని పూర్తిస్థాయిలో పట్టించుకోలేదు. బడ్జెట్ కేటాయింపులను చేయలేదు. ఎన్నికల్లో ఇచ్చిన విధంగా ఆరు గ్యారంటీలు, 13 హామీలకు పూర్తిస్థాయిలో నిధుల కేటాయింపు చేయలేదు. ప్రజల సంక్షేమం, అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని కేటాయింపులు చేయలేదు. అన్ని వర్గాలను నిరాశపరిచే విధంగా ఈ బడ్జెట్ ఉంది.

హామీలకు అనుగుణంగా కేటాయిపులు..

: పి.సుధాకర్, సీపీఐ జిల్లా కార్యదర్శి



ఇచ్చిన హామీలకు అనుగుణంగా కేటాయింపులను చేశారు. విద్య, వైద్యం, కుటీర చిన్న పరిశ్రమలకు బడ్జెట్‌లో ఇంకా నిధులు పెంచితే బాగుండేది. కేజీ టూ పీజీ వరకు ఉచిత విద్య, ప్రభుత్వ ఆసుపత్రులలో సౌకర్యాలకు మరిన్ని నిధులను కేటాయించాలి. వ్యవసాయ రంగానికి అవసరమైన పనిముట్లకు సబ్సిడీలు ఇవ్వాలి.

ప్రజలకు ఉపయోగపడే బడ్జెట్ కాదు..

: దినేష్ కులాచారి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు



ఈ బడ్జెట్ ప్రజలకు ఉపయోగపడే విధంగా లేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు తగినన్ని నిధులను కేటాయించలేదు. గత ప్రభుత్వం నిధులన్నీ కాళేశ్వరానికి కేటాయించి కొల్లగొట్టగా ఈ ప్రభుత్వం మూసీ నదికి కేటాయించి ప్రజాధనాన్ని దోచుకోవాలని చూస్తుంది. మేనిఫెస్టోకు అనుగుణంగా యువతకు, మహిళలకు కనీసం పట్టించుకోలేదు.

నాడు..



నేడు..



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పూలాంగ్‌లో పూడిక తీత

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించిన అధికారులు
- వాగులో గుర్రపు డెక్కల తొలగింపు
- కెనాల్‌లో ఆటంకం లేకుండా పారుతున్న వరద

సుభాష్‌నగర్, జూలై 25: పూలాంగ్ కెనాల్‌లో పేరుకుపోయిన చెత్తను తీసివేయడంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారన్న నేపథ్యంలో 'పూలాంగ్‌లో పూడికతీతలు ఎప్పుడు?' అనే శీర్షికన ఈ నెల 17న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. వాగులో ఉన్న గుర్రపుడెక్కలను తీసివేశారు. జేసీబీల సహాయంతో చెత్తా, చెదారం, పిచ్చిమొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. దీంతో కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షపు నీరు ఎలాంటి ఆటంకం లేకుండా ప్రవహిస్తోంది.





• ఆర్యనగర్‌లో రోడ్డు ఇలా..

అడుగడుగునా గుంతలు!

- నగరంలో వాహనాల రాకపోకలు తప్పని ఇబ్బందులు
- చిన్నపాటి వర్షానికే చెరువులను తలపిస్తున్న రోడ్లు
- నాసిరకం పనులతో గుంతలు తేలిన రహదారులు

సుభాష్‌నగర్, జూలై 25: జిల్లాలో కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు రహదారులు గుంతలమయంగా మారాయి. నగరంలోని వర్ని చౌరస్తాలో గల ప్రధాన రహదారిపై అడుగడుగునా గుంతలు ఏర్పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ప్రతీరోజు వందలాది వాహనాలు తిరిగే గంజ్ ప్రాంతంలోనూ చాలా చోట్ల రోడ్లు గుంతలు పడ్డాయి. గాయత్రీనగర్ ప్రాంతంలో సైతం రోడ్లు గుంతలుగా మారడంతో అక్కడి కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రోడ్ల పరిస్థితి ఇలా ఉంటే శివారు కాలనీల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. నగరంలోని శివారు కాలనీలో ఇప్పటికీ మట్టి రోడ్లే దిక్కయ్యాయి. వర్షం వస్తే బురదమయంగా మారుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ప్రతీ డివిజన్‌లోని ప్రధాన ప్రాంతాల్లో తారు రోడ్లను వేశారు. అయితే నాసిరకంగా రోడ్లు వేయడంతో గుంతలుగా మారాయి. దీంతో ప్రజలు రాకపోకలలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కోట్ల రూపాయలు ఖర్చు చేసి వేసిన రోడ్లు సంవత్సరం తిరగకుండానే గుంతలమయంగా మారడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రధాన రోడ్లతో పాటు శివారు కాలనీలో సైతం రోడ్లను వేసి ప్రజల ఇబ్బందులను గట్టెక్కించాలని స్థానికులు కోరుతున్నారు.

చెరువులను తలపిస్తున్న రోడ్లు..

నగరంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో చిన్నపాటి వర్షానికే రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. ముఖ్యంగా నగరంలోని పాత బీఎస్ఎన్ఎల్ చౌరస్తా వద్ద చిన్నపాటి వర్షానికే నీరు చేరడంతో పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్టాండ్ వైపు వెళ్లే పాదచారులు ఇతరుల వాహనాలను ఆశ్రయించి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు రైల్వేస్టేషన్ నుంచి బస్టాండ్ వైపు వెళ్లే రహదారులు మోకాళ్లలోతు నీళ్లు చేరడంతో పాదచారులతో పాటు వాహనాలు వెళ్లడానికి ఇబ్బందిగా మారింది. గత సంవత్సరం నుంచి ఇలాగే కొనసాగుతున్నా ప్రజాప్రతినిధులు కానీ, అధికారులు కానీ పట్టించుకోవడం లేదు. ప్రతీ చిన్న వర్షానికి ఇదే పరిస్థితి కొనసాగుతున్నా పరిస్థితుల్లో మార్పు తేవడానికి మాత్రం ప్రయత్నించడం లేదు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించి పూర్తయిందని చెబుతున్న ప్రజాప్రతినిధులు వాటికి కనెక్షన్‌లను ఇంటి నుంచి అండర్‌గ్రౌండ్‌కు ఇవ్వకపోవడంతో మురికి కాలువల నుంచి రోడ్డుపైకి నీరు వచ్చి చేరుతోంది.

రోడ్లపైనే చెత్త..

నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో రోడ్లపైనే చెత్తను వేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపైనే చెత్తను వేయడంతో ఆ ప్రాంతమంతా దుర్గంధం వెదజల్లుతోంది. గంజ్‌కు వెళ్లే రోడ్డుపైనే చెత్తను వేయడంతో ఆ ప్రాంతమంతా దుర్గంధం వెదజల్లుతోంది. చెత్తను తీసుకువెళ్లే వాహనాలు ఇంటింటికీ తిరుగుతున్నా సమయానికి వాహనాలు రాకపోవడంతో ప్రజలు వాటిని కాదని స్థానికులు రోడ్లపైనే చెత్తను వేస్తున్నారు. దీంతో వివిధ పనుల నిమిత్తం జిల్లా కేంద్రానికి ప్రజలు దుర్గంధంతో ముక్కుమూసుకుంటున్నారు. ఇప్పటికైనా నగర పాలక సంస్థ అధికారులు రోడ్లు, పారిశుధ్యంపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.





• గంజ్‌కు వెళ్లే రోడ్డు ఇలా..



కమలాపూర్ ఒర్రె కాలువలో ప్రవహిస్తున్న వరద

ఎడతెరిపిలేని వర్షం

- జిల్లా వ్యాప్తంగా 24.6 మిల్లీమీటర్ల వర్షం నమోదు
- జిల్లాలోని చెరువుల్లోకి భారీగా చేరుతున్న నీరు
- శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు క్రమేపీ పెరుగుతున్న వరద




• మోకన్‌పల్లిలో పారుతున్న అలుగు

నిజామాబాద్, జూలై 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ఎడతెరపిలేకుండా వర్షం పడుతూనే ఉంది. వర్షాలకు వాగులు పొంగుతుండటం, కొన్ని చెరువులు నిండి అలుగులు పారుతున్నాయి. జిల్లాలో బుధవారం రాత్రి నుంచి గురువారం వరకు 24.6 మిల్లీమీటర్ల వర్షం పడింది. జిల్లాలో అత్యధికంగా కోటగిరి మండలంలో 34.1 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది. జిల్లాలోని అన్ని మండలాల పరిధిలో 10 మిల్లీమీటర్లకు పైనే వర్షం పడింది. జిల్లాలో జూన్ నుంచి ఇప్పటి వరకు 375.7 మిల్లీమీటర్ల వర్షం పడాల్సి ఉండగా 470.2 మిల్లీమీటర్ల వర్షం పడింది. జిల్లాలోని 21 మండలాల్లో సరాసరి సగటువర్షపాతం కంటే అధికంగా వర్షం పడింది. జిల్లాలోని 12 మండలాల్లో సరాసరి సగటు వర్షపాతం నమోదైంది. జిల్లాలో మొత్తం 996 చెరువులు ఉండగా ఇప్పటి వరకు 103 చెరువులు నిండటంతో పాటు అలుగులు పారుతున్నాయి. జిల్లాలో 186 చెరువుల్లో 75 శాతానికి పైగా నీళ్లు చేరగా, 316 చెరువుల్లో 50 శాతంకు పైగా వరదనీరు వచ్చి చేరింది. జిల్లాలోని 188 చెరువుల్లో 50 శాతంలోపు నీళ్లు చేరగా, 203 చెరువుల్లో 25 శాతంలోపు వరదనీరు వచ్చి చేరింది.

ఎస్సారెస్పీకి కొనసాగుతున్న వరద..

ఎగువ ప్రాంతంతో పాటు మహారాష్ట్రలో పడుతున్న వర్షాలతో ప్రాజెక్టుకు వరద కొనసాగుతోంది. గోదావరి, మంజీరా, హరిదా నదుల నుంచి కూడా కొంత మేర వరద వస్తుండటంతో ప్రాజెక్టులో నీటిమట్టం పెరుగుతోంది. ప్రాజెక్టుకు ప్రస్తుతం 21,650 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులకు గాను ప్రస్తుతం 1071.9 అడుగులకు నీటిమట్టాలు చేరాయి. ప్రాజెక్టులో 80.5 టీఎంసీలకు గాను 26.567 టీఎంసీల నీళ్లు చేరాయి. జూన్ నుంచి ఇప్పటి వరకు ప్రాజెక్టులోకి 20.691 టీఎంసీల నీళ్లు వచ్చి చేరాయి.



దోస్త్ స్పెషల్ ఫేస్ ద్వారా ఖాళీల భర్తీ

ధర్పల్లి, జూలై 25: ధర్పల్లి, సిరికొండ మండలాల్లో ఇంటర్మీడియెట్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు దోస్త్ స్పెషల్ ఫేస్ షెడ్యూల్ తేదీ ఈనెల 25 నుంచి ఆగస్టు 2 వరకు ఉందని ప్రిన్సిపాల్ పి.రామ్మోహన్ రెడ్డి తెలిపారు. ధర్పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ ఇంగ్లీష్ మీడియాం 51, తెలుగు మీడియం 58,బీకాం సీఏ 105, బీఎస్సీ లైఫ్‌సైన్స్ 44, బీఎస్సీ ఫిజికల్ సైన్స్ 43 సీట్లు ఖాళీగా ఉన్నాయని ఆసక్తి గల విద్యార్థులు, ఇంతవరకు రిజిస్ట్రేషన్ చేసుకొని వారు కూడా ఈ స్పెషల్ ఫేస్ ద్వారా అడ్మిషన్ పొందవచ్చని పేర్కొన్నారు.







ఆలూర్‌లో స్పెషల్‌డ్రైవ్

ఆర్మూర్‌రూరల్, జూలై 25: మండల కేంద్రంలో ప్రజలకు సీజనల్ వ్యాధులు సోకకుండా అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులచే మురికికాల్వలు శుభ్రం చేయించారు. పెద్ద డ్రైనేజీల్లో పెరుకుపోయిన చెత్తను జేసీబీ సహాయంతో తీసి మురికినీరు వెళ్లేలా చేశారు. అనంతరం ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి, వైద్యసిబ్బందితో సమావేశం నిర్వహించి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజలింగం, డాక్టర్ గణేష్, లైన్‌మెన్ శివ, కారోబార్ సంతోష్ పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి

పెద్దబజార్, జూలై 25: ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఎంపీ సతీమణి ప్రియాంక ధర్మపురి అన్నారు. గురువారం సీఎంఆర్ సెంట్రల్ ఆడిటోరియంలో 25వ కార్గిల్ విజయ దివాస్ సందర్భంగా జమ్మూకశ్మీర్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో అమరవీరుల స్మృతిలో మొక్కలు నాటారు. అ నంతరం కార్గిల్ అమరవీరుల కుటుంబ సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పూర్వ సీఎస్ ఎల్.వి.సుబ్రహ్మణ్యం, ఎయిర్ కమాండర్ వి.ఎం.రెడ్డి, బీజేపీ తమిళనాడు అధ్యక్షుడు అన్నమలై కుప్పుస్వామి, ప్రముఖ సినిమా ఫొటోగ్రాఫర్ సెంథిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.







కత్తులతో బెదిరించి చోరీ



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ మల్లేష్, ఎస్సై తిరుపతి

జక్రాన్‌పల్లి, జూలై 25: కత్తులతో మహిళను బెదిరించి అరిస్తే చంపివేస్తామని ఇంట్లోకి చొరబడి బీరువలో ఉన్న బంగారు పుస్తెలతాడు, నగదును గుర్తుతెలియని వ్యక్తులు దోచుకెళ్లారు. ఈ ఘటన బుధవారం అర్ధరాత్రి మండలంలోని నారాయణపేట్ గ్రామంలో జరిగింది. గురువారం ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని దుండగులు అర్ధరాత్రి నారాయణపేట్ గ్రామంలో జాన్కంపేట లక్ష్మీ ఇంట్లో ఒంట గిరిగా ఉందని గుర్తుతెలియని ముగ్గురు దుండగులు వచ్చారని తెలిపారు. ఆమె ఇంటికి తలుపులు కొట్టి మీ మరిది చనిపోయాడని, మహిళకు చెప్పడంతో సదరు ఆమె తలుపులు తీసిందన్నారు. దీంతో ముగ్గురు గుర్తు తెలియని దుండగులు లక్ష్మీకి కత్తిచూపించి చంపివేస్తానని బెదిరించి ఇంట్లోని బీరువ తాళాలు పగులగొట్టి అందులో ఉన్న రెండు తులాల బంగారు గొలుసు, రూ.10వేల నగదు దోచుకెళ్లారన్నారు. లక్ష్మీ కుమారుడు మహేష్ ఇచ్చిన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దార్యప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. సంఘటన స్థలాన్ని డిచ్‌పల్లి సీఐ మల్లేష్, ఎస్సై తిరుపతి పరిశీలించారు. క్లూస్‌టీం వచ్చి వేలి ముద్రలను సేకరించారని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఎవరైనా రాత్రి సమయంలో అనుమానాస్పదంగా తిరిగితే వెంటనే 100లేదా 8712659853 నెంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.

మంజీరా నదిన ఒడ్డున పశువుల కాపర్లు

● గజ ఈతగాళ్ల సాయంతో ఒడ్డుకు చేర్చిన పోలీసులు



గజ ఈతగాళ్ల సహాయంతో నది దాటుతున్న పశువుల కాపర్లు

బోధన్‌రూరల్, జూలై 25: సాలూర మండలంలోని మందర్నా గ్రామ శివారులో గల మంజీరా ఒడ్డున ఉన్న ముగ్గురు పశువుల కాపర్లను సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. వివరాలు.. రోజు మాదిరిగా గురువారం ఉదయం పశువులను తీసుకొని శివరాజ్, చందు, ప్రకాష్ మహరాజ్‌లు పశులను మేపడానికి నది దాటి మహారాష్ట్రలోని ఎస్గి అటవీ ప్రాంతానికి వెళ్లారు. సాయంత్రం పశువులను తీసుకుని తిరుగు ప్రయాణం అయ్యారు. కాగా ఇటీవల కురుస్తున్న వర్షాలతో పాటు లెండీ ప్రాజెక్టు నీళ్ల వదలడంతో మంజీరా నదికి ప్రవాహం పెరిగింది. దీంతో పశువులు ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకున్నాయి. కాగా, ముగ్గురు పశువుల కాపరులలో ప్రకాష్ మహరాజ్ వృద్ధుడు కావడంతో నది దాటేందుకు జంకడంతో మిగతా కాపర్లు గ్రామస్థులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. దీంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. బోధన్ రూరల్ సీఐ కోలా నరేష్ పోలీసులతో సంఘటన స్థలానికి చేరుకుని గజ ఈతగళ్లను రప్పించి నది ఒడ్డున ఉన్న కాపరులను సురక్షితంగా తీసుకువచ్చారు.

మహిళపై హత్యాయత్నం కేసు నమోదు

నవీపేట, జూలై 25: నిజామాబాద్ మండలం జలాల్‌పూర్‌కు చెందిన సావిత్రి అనే మహిళపై గురువారం హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ యాదగిరి గౌడ్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. జలాల్‌పూర్‌కు చెందిన గైనిశెట్టి గంగవ్వ నెల రోజుల క్రితం తన వద్ద ఉన్న కుక్కర్‌ను అదే గ్రామానికి చెందిన సావిత్రికి 2వేల రూపాయలకు విక్రయించింది. కుక్కర్ కొద్ది రోజులు బాగానే పని చేసిన తర్వాత అది పని చేయడం లేదు. దీంతో 5రోజుల క్రితం గంగవ్వ, సావిత్రిలు కలిసి నిజామాబాద్ వెళ్లి కుక్కర్‌కు రిపేర్ చేయించారు. అయినప్పటికీ కుక్కర్ సరిగా పని చేయడం లేదు. విసుగు చెందిన సావిత్రి గురువారం ఉదయం కుక్కర్‌తో పాటు కత్తిని వెంట తీసుకుని గంగవ్వ ఇంటికి వెళ్లింది. కుక్కర్ వాపసు తీసుకుని తన డబ్బులు తిరిగి ఇచ్చేయాలని గొడవకు దిగింది. ఈ సమయంలో సావిత్రి తన వద్ద ఉన్న కత్తితో గంగవ్వ తలపై దాడి చేయడంతో ఆమె తీవ్రంగా గాయపడింది.వెంటనే సావిత్రి దాడి చేసి పారిపోవడానికి యత్నించింది. స్థానికులు సావిత్రినివెంబడించగా అదుపుతప్పికింద పడడంతో ఆమె కాళ్లు, పొట్టభాగంలో గాయాలయ్యాయి.వెంటనే 108లో బాధితురాలు గంగవ్వతో పాటు సావిత్రిని చికిత్స నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.బాధితురాలు గంగవ్వకు వరుసకు సోదరుడుఅయ్యేరాజు ఫిర్యాదు మేరకు సావిత్రిపైహత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

టీయూలో న్యాయ కళాశాలలో పరీక్షలు

డిచ్‌పల్లి, జూలై 25: తెలంగాణ విశ్వవిద్యాలయంలోని న్యాయ కళాశాలలో ఎల్ఎల్‌బీ చివరి సంవత్సరం విద్యార్థులకు మూట్ కోర్టు పరీక్షలు గురువారం నిర్వహించినట్లు బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్ పర్సన్ జట్లింగ్ ఎల్లోసా తెలిపారు. ఈ పరీక్షలకు ఎక్సాటర్నల్ ఎక్సామినార్ నిజామాబాద్ సీనియర్ న్యాయవాది వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ పరీక్షల్లో భాగంగా విద్యార్థులకు మన రాష్ట్రంలో పార్టీల మార్పిడి వ్యవహారాలపై కేసులు రూపొందించి సుప్రీం కోర్టు ముందు వాజ్యం దాఖలు అయిన సందర్భంగా స్పీకర్‌కు గల విచక్షణ అధికారలపై న్యాయ విద్యార్థులకు వివరించారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రసన్నరాణి, డా.స్రవంతి, డా.నాగజ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

ఏర్గట్ల, జూలై 25: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణచారి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర శిక్షణలో భాగంగా విద్యార్థులచే సాంస్కృతిక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగు పండితులు ప్రవీణ్ శర్మ, ఉపాధ్యాయులు గంగాధర్, మునీరోద్దీన్ పాల్గొన్నారు.



తాళం వేసిన ఉన్న ఇంట్లోచోరీ

● సుమారు 13 తులాల బంగారు ఆభరణాలు చోరీ



బీరువాను పరిశీలిస్తున్న సీఐ

ఖిల్లా, జూలై 25: నగరంలోని మూడో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి లోని హమాల్‌వాడీ ప్రాంతంలో తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని దుండగులు చొరబడి బీరువాలో ఉన్న సుమారు 13 తులాల బంగారు ఆభరణాలను చోరీ చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. హమాల్‌వాడీకి చెందిన వారణాసి పెంటయ్య తన కుటుంబ సభ్యులతో హైదరాబాద్‌లో జరిగే శుభకార్యానికి మంగళవారం వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉండటాన్ని గమనించిన గుర్తుతెలియని దుండగులు తాళం పగలగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు.గురువారం కుటుంబ సభ్యులు ఇంటికి చేరుకొని పరిశీలించగా ఇంటికి వేసిన తాళం ధ్వంసమై కిందపడి ఉండటాన్ని గమనించి లోపలికి వెళ్లి చూడగా ఇంట్లో సామాన్లు చిందర వందరగా ఉండటంతో పాటు బీరువా తెరిచి ఉండటాన్ని గమనించారు. బీరువాలో ఉన్న బంగారు ఆభరణాల కోసం వెతుకగా కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న నగర ఇన్‌స్పెక్టర్ నరహరి, ఎస్సై ఎల్.ప్రవీణ్, సీసీఎస్ సీఐలు, డాగ్‌స్క్వాడ్ చేరుకొని పరిశీలించారు. వేలిముద్రలను సేకరించారు. పరిసరాలను స్థానికుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

● దూర ప్రాంతాలకు వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలి

ఇంటికి తాళం వేసి వివిధ శుభకార్యాలకు వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలని నగర సీఐ నరహరి తెలిపారు. విలువైన వస్తువులు, బంగారు ఆభరణాలు, నగదు ఉంచరాదని సూచించారు. దొంగతనాలను నియంత్రించేందుకు పోలీసువారి సూచనలు పాటించాలని తెలిపారు. దూర ప్రాంతాలకు వెళ్లేముందు సంబంధిత పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ప్రతీ ఒక్కరు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా తాళం వేసి వెళ్లేవారు పక్కింటి వారికి సమాచారం ఇచ్చి ఎన్ని రోజుల్లో వస్తారో తెలియజేయాలన్నారు.వారికి తమ సెల్‌ఫోన్ నెంబర్లు ఇచ్చి వెళ్లాలన్నారు. పరిస్థితులను అడిగి తెలుసుకోవాలని సూచించారు.

'నగర అభివృద్ధికి రూ.పదికోట్లు విడుదల'

నిజామాబాద్ అర్బన్, జూలై 25: నిజామాబాద్ నగర అభివృద్ధిలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద ప్రతీ నియోజకవర్గానికి పది కోట్లను కేటాయించడం అభినందనీయమని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కేశవేణు ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని అన్ని ప్రాంతాల్లోని రోడ్లను బాగు చేయడంతో పాటు కొత్తగా డ్రైనేజీలు, కల్వర్లు నిర్మించేందుకు సుమారు రూ.6.25 కోట్లు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో అదనపు తరగతి గదులు, మరుగుదొడ్ల నిర్మాణం కోసం కోటి 30లక్షలు మొత్తం రూ.7కోట్ల 55 లక్షలు మంజూరు చేసినందుకు సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. మిగిలిన నిధులను నగరంలో మంచినీటి వ్యవస్థ కోసం కేటాయించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సీఎంతో పాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు, అర్బన్ ఇన్‌చార్జి షబ్బీర్‌అలీ, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్‌లకు నగర ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకుల తరఫున ధన్యవాదాలు తెలియజేశారు.

సెల్‌ఫోన్‌ల రికవరీలో రాష్ట్రంలోనే మొదటి స్థానం

ఖిల్లా, జూలై 25: వివిధ కారణాలతో సెల్‌ఫోన్‌లను పోగొట్టుకున్న వారికి సీఇఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి వాటిని బాధితులకు అప్పగించడంలో రాష్ట్రంలోనే నగర ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ మొదటి స్థానంలో నిలిచింది. ఈ యాప్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు 499 సెల్‌ఫోన్‌లను బాధితులకు అప్పగించిన ఎస్‌హెచ్‌వో డి.విజయ్‌బాబుతో పాటు సిబ్బందిని ఉన్నతాధికారులు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగెనవార్ తదితరులు అభినందించారు. ఈయాప్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 30 పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో స్వాధీనం చేసుకున్న పోలీస్ స్టేషన్‌ల వివరాలను పోలీసుశాఖ గురువారం ప్రకటించింది. అందులో నిజామాబాద్ ఒకటో టౌన్ మొత్తం 1432 సెల్‌ఫోన్‌ల డివైసెస్ బ్లాక్ చేశారు.ఇందులో 904 సెల్‌ఫోన్‌లను గుర్తించారు. వాటిలో 499 ఫోన్‌లను బాధితులకు అప్పగించారు.నిజామాబాద్ తర్వాత రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ 462తో రెండో స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌వో డి.విజయ్‌బాబు మాట్లాడుతూ పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను ఫిర్యాదు చేసిన వెంటనే తమ సిబ్బందితో సిఇఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. దీంతో తాము తక్కువ సమయంలో ఎక్కువ సెల్‌ఫోన్‌లను బాధితులకు అప్పగించడం జరిగిందన్నారు. అందుకు సిబ్బంది కృషి ఫలితంగానే రాష్ట్రంలో మొదటి స్థానం దక్కడం సంతోషంగా ఉందన్నారు.

పాఠశాలలను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్



కేజీబీవీ ఆవరణను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

ఆర్మూర్‌టౌన్‌జూలై25: మున్సిపల్ పరిధిలోని కస్తూర్బ పాఠశాల, మైనారిటీ స్కూళ్లను గురువారం మున్సిపల్ కమిషనర్ రాజు పరిశీలించారు.పాఠశాలల చుట్టు పక్కల ప్రాంతాల్లో పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే హెల్త్ ఆఫీసర్ మానసతో మాట్లాడి పాఠశాలలో హెల్త్‌క్యాంప్‌లు నిర్వహించాలని సూచించారు. కస్తూర్బా పాఠశాల ఆవరణలో గత కొన్నేళ్లుగా మురికినీరు నిలిచి విద్యార్థులకు అవస్థలు అవుతున్నాయని ఉపాధ్యాయులు, విద్యార్థినులు తెలుపగా వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత సమస్యను పరిష్కరిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. ఆయన వెంట సానిటరీ ఇన్స్‌పెక్టర్ గజానన్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ పూర్ణమౌళి, మున్సి పల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న ముసురు వాన



కోమటిపల్లి, నికాల్‌పూర్ గ్రామాల మధ్య రాకపోకలు నిలిపివేసిన ఎస్సై



ఎత్తొండలో కూలిన ఇల్లును పరిశీలిస్తున్న తహసీల్దార్ సునీత



విద్యుత్ మరమ్మతులు చేస్తున్న దృశ్యం



జాన్కంపేట్‌లో వరినాట్లు పైరు నీట మునిగిన దృశ్యం



ముప్కాల్ వాగులో నిండుగా ప్రవహిస్తున్న నీరు

రుద్రూరు, జూలై 25: రుద్రూరు మండలంలో అల్పడీన ప్రభావం తో వర్షం ముసురేసింది.గత నాలుగు రోజులుగా ఉదయం నుంచి రాత్రి వరకు ముసురుతో వర్షం కొనసాగుతుంది. ముసురుతో గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బయటకు వెళ్లలేని పరిస్థితి. విద్యార్థులు, ఉద్యోగులు, చిరు వ్యాపారులు అవస్థలు పడుతున్నారు.పలుగ్రామాల్లో వర్షంతో చెరువులు, కుంటల్లో నీరు చేరుతుంది. గ్రామాల్లో అంతర్గత రోడ్లు బురదమయంగా మారాయి.అంటువ్యాధులు ప్రభలే అవకాశం ఉన్న దృ ష్ట్యా ఆరోగ్య రక్షణకు తగుజాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు పేర్కొంటున్నారు.

● వర్షానికి కూలిన ఇళ్లను పరిశీలించిన రెవెన్యూ అధికారులు

గత నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షానికి పాత ఇళ్లు దెబ్బతింటున్నాయి. మండలంలోని వివిధ గ్రామాల్లో శిథిలా వస్థకు చేరిన ఇళ్లు కూలుతున్నాయి. అయితే గురువారం మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నజీర్ వివిధ గ్రామాల్లో పర్యటించి వర్షానికి కూలిన ఇండ్ల వివరాలను సేకరించారు. రాణంపల్లి 11, రుద్రూరు ఐదు, రాయకూర్‌లో ఒక ఇల్లు దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా గుర్తించామని ఆయన వెల్లడించారు.

కోటగిరి: కోటగిరి ఉమ్మడి మండలంలో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు 13ఇళ్లు కూలినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. మండలంలోని ఎత్తొండ గ్రామంలో 7ఇళ్లు పాక్షికంగా కూలగా రెండు ఇళ్లు పూర్తిగా కూలినట్లు తహసీల్దార్ సునీత తెలిపారు. అలాగే మండలంలోని సుద్దులం గ్రామంలో ఒక ఇల్లు, పొతంగల్ మండలంలోని జల్లాపల్లి ఆబాది, కొల్లూర్, దోమలెడ్గి గ్రామాలలో ఒక్కొక్క ఇల్లు దెబ్బతిన్నట్లు తహసీల్దార్ మల్లయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో కోటగిరి ఆర్ఐ సయ్యద్ హుస్సేన్, పంచాయతీ కార్యదర్శి ఉమాకాంత్ తదితరులున్నారు.

● మండలంలో ఎడతెరిపి లేని వర్షం

కోటగిరి ఉమ్మడి మండలంలో మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. కోటగిరి మండలంలో గురువారం 34.5మి.మీటర్ల వర్షపాతం నమోదు కాగా పొతంగల్ మండలంలో 32.3మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు చెరువులు జలకళను సంతరించుకున్నాయి. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో రహదారులన్నీ బురదమయంగా మారాయి. కోటగిరి మండల కేంద్రంలోని ఎన్‌టీఆర్ చౌరస్తా నుంచి ఎక్లాస్‌పూర్ వెళ్లే రహదారి బురద మయంగా మారడంతో రాకపోకలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండలంలోని ఆయా గ్రామాలల్లోనూ రహదారులు బురదమయంగా మారాయి.

● భారీ వర్షాలకు కూలిన ఇల్లు

నవీపేట: మండలంలోని మద్దెపల్లిలో భారీ వర్షాలకు నివాసపు ఇల్లు కూలింది. గ్రామానికి చెందిన పసుపుల రాజుకు చెందిన నివాసపు ఇల్లు గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు బుధవారం రాత్రి కూలిపోయిందని గ్రామస్థులు తెలిపారు.

● భారీ వర్షాలకు అలుగు పారుతున్న చెరువులు

నవీపేట: గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని పలు చెరువులు పూర్తిగా నిండి అలుగులు పారుతున్నాయి. మండలంలో 91చెరువులు ఉండగా 38చెరువులు పూర్తిగా నిండి అలుగులు పారుతున్నాయి. అలాగే కమలాపూర్ ఒర్రె కాలువలో భారీ వర్షాలకు వరద నీటి ప్రవాహం పెరిగింది. భారీ వర్షాలు ఇదే విధంగా కొనసాగితే మిగిలిన చెరువులు సైతం నిండే అవకాశాలు ఉన్నాయన్నారు.

● నందిగామ రోడ్డుపై గుంత

నవీపేట: మండలంలోని యంచ నుంచి నందిగామ వెళ్లే రహదారిపై బుధవారం రాత్రి గుంత ఏర్పడిందని స్థానికులు తెలిపారు. గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు యంచ, నందిగామ మధ్యన రోడ్డుపై గుంత ఏర్పడడంతో భారీ వాహనాలు ఇరు గ్రామాల మధ్యన ప్రయాణించడానికి వీలులేకుండా పోయిందని స్థానికులు పేర్కొన్నారు. రోడ్డుపై గుంత ఏర్పడడంతో ఆర్టీసీ బస్సు రాకపోకలను అధికారులు నిలిపివేయడంతో నందిగామకు చెందిన ప్రజలతో పాటు విద్యార్థులు తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారని గ్రామస్థులు పేర్కొన్నారు. వెంటనే రోడ్డుపై ఏర్పడ్డ గుంతను పూడ్చివేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

● నీట మునిగిన వరి పంట

వేల్పూర్: గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న ముసురుపట్టిన వర్షానికి వేల్పూర్ మండలంలోని పలు గ్రామాల్లో నాట్లు వేసి వరి పంటను నీట మునిగాయి. గత వారం రోజుల క్రితం నీళ్లు లేక బోసిపోయిన బోరుబావులు ఈ వర్షంతో భూగర్భజలాలు పెరిగి బోరుబావుల నుంచి నీరు నిండుగా వస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చెరువులు, కుంటలు, ఒర్రెలలో వర్షం నీరు భారీగా చేరుతు ంది. పంట పొలాల్లో నీరు భారీగా చేరి గత నాలుగు రోజుల నుంచి వేసిన వరినాట్లు పైరు నీటిలో పూర్తిగా మునిగిపోయాయి. నీటిలోముని గిన వరిపైరు త్వరగా కొలుకోవడానికి పోటాషియం నైట్రెట్ 20గ్రాములు లీటర్ నీటి చొప్పున కలిపి పైరుకు పిచికారి చేయడం వల్ల పంట నష్టాన్ని నివారించుకోవచ్చని వ్యవసాయాధికారులు తెలిపారు.

● కురుస్తున్న వర్షాలతో పారుతున్న వాగులు

ముప్కాల్:ముప్కాల్, బాల్కొండ మండలాల్లో కురుస్తున్న వర్షాలకు వాగులు, చెరువులు వర్షం నీరు నిండుగా ప్రవహిస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల లోతట్టు ప్రాంతాలు జలమయామయ్యాయి. రోడ్లపై వర్షం నీరు చేరి రాకపోకలకు వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలు గ్రామాల్లో కురుస్తున్న వర్షాలకు చెరువులు జలకళను సతరించుకుంటున్నాయి.

● లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన కౌన్సిలర్

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని 2వార్డులో సిక్కుల కాలనీలో లోతట్టు ప్రాంతాలను స్థానిక కౌన్సిలర్ ఖాందేశ్ సంగీత పరిశీలించారు. గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఇళ్లమధ్యలోకి వర్షంనీరు రావడంతో మున్సిపల్ అధికారులకు సమాచారం అందించి నిలిచి ఉన్న వర్షం నీటిని తొలగించాలని సూచించారు. ఆమె వెంట కాంగ్రెస్ నాయకులు ఖాందేశ్ సత్యం, మెతబ్ సింగ్, తదిత రులు పాల్గొన్నారు.

● కోమటిపల్లి, నికాల్‌పూర్ గ్రామాల మధ్య రాకపోకలు నిలిపివేత

డొంకేశ్వర్: మండలంలోని కోమటిపల్లి, నికాల్‌పూర్ గ్రామాల మధ్య ఉన్న లోలెవల్ వంతెనపై గత నాలుగు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుసుతన్న వర్షానికి చెరువు ఉదృతంగా ప్రవహిస్తుండడంతో కోమటిపల్లి, నికాల్‌పూర్ గ్రామాలకు గురువారం ఎస్సై రాహుల్ రాకపోకలను నిలిపివేశారు. ప్రమాదాలు జరుగకుండా ముందస్తు చర్యలుగా పోలీసు అధికారులు రెండు గ్రామాల వైపు ట్రాక్టర్‌లను, ట్రాక్టర్ ట్రాలీ, కడ్లను ఏర్పాటు చేసి రాకపోకలను నిలిపివేశారు. ఈ మార్గం గుండా ఎవరు ప్రయాణించవద్దని ఆయన సూచించారు. చెరువు వరద ప్రవహం ఎక్కువగా ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

డిచ్‌పల్లి-నిజామాబాద్ రోడ్డుపై గుంతలు

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి-నిజామాబాద్ ప్రధాన రోడ్డు మండల కేంద్రంలో చాలా చోట్ల వర్షాల దాటికి గుంతల మయంగా మారింది. ప్రమాదాల నివారణకు నడిపల్లి పంచాయతీఈవో కిషన్ రావు ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది ప్రమాదాల నివారణకు భారీ కేడ్ లు ఏర్పాటు చేశారు. దీంతో వాహనచోదకులు పంచాయతీ సిబ్బందికి అభినందలు తెలిపారు.

● వర్షంలో పరిశీలిస్తున్న మండల పంచాయతీ అధికారి

జిల్లాపంచాయతీ అధికారి గురువారం భారీ వర్షంలోను డిచ్‌పల్లి, నడిపల్లి, బర్దిపూర్, ధర్మారం(బి) గ్రామ పంచాయతీలను తనిఖీ చేసి పారిశుద్ధ్య పనులను తనిఖీచేశారు. డీపీవో తరుణ్ కుమార్ మాట్లాడుతూ .. డెంగ్యు, మలేరియ, సీజనల్ వ్యాధులు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. మురికి నీరు నిల్వ ఉన్న చోట అయిల్ బాల్ వేయా లని సూచించారు. రోడ్లపై ఇరువైపులా పిచ్చి మొక్కలు తొలగించాలని కార్యదర్శులకు సూచించారు. మురికి కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని చెత్తను డంపింగ్ యార్డుకు తరలించలన్నారు. ఆయన వెంట ఎంపీవో శ్రీనివాస్ గౌడ్, కార్యద ర్శులు కిషన్‌రావు, బాలకిష్ట, వినయ్, పాల్గొన్నారు.

● భారీ వర్షంలో విద్యుత్ అధికారుల మరమ్మతులు

సుభాష్‌నగర్:భారీ వర్షంలోనూ విద్యుత్ అధికారులు విద్యుత్‌ను పునరుద్ధరించడానికి శ్రమించారు. జిల్లా కేంద్రంలని బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం పక్కన 11కెవి డిస్క్ ఫెయిల్ కావడంతో ఆ ప్రాంతం అంతా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. టౌన్-2 ఏడీఈ తోటరాజశేఖర్ ఆధ్వర్యంలో వర్షాన్ని సైతం లెక్కచేయకుండా 11కెవి డిస్క్‌ను మార్చి విద్యుత్‌ను పునరుద్ధరించారు. పునరుద్ధరణ పనుల్లో డి-2 ఏఈ సునీత, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో వ్యాధులపై అవగాహన



ఇందల్వాయిలో వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అబ్దుల్ షఫీ

ఇందల్వాయి,జూలై 25: ఇందల్వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ప్రపంచ ఆరోగ్యసంస్థ పర్యవేక్షకులు డాక్టర్ షఫీ అసం క్రమిక వ్యాధులైన హైపర్‌టెన్షన్, డయాబెటిస్, క్యాన్సర్ వంటి వ్యాధులకు ప్రభుత్వం తరపున ఇస్తున్న చికిత్స గురించి ఇందల్వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోగల 16ఆరోగ్య ఉపకేంద్రాల ఆరోగ్య కార్యకర్తలకు సమీక్ష సమావేశం నిర్వహించి వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ప్రతిరోగికి నెలకు సరిపడా మందులను ఉచితంగా అందజేయాలని, ప్రభుత్వం ద్వారా వచ్చే మందులు వాడేలా చూడాలని అన్నారు. ప్రైవేటు ఆసుపత్రుల మందులు ఏవైనా వాడినట్లయితే వారు ప్రభుత్వం మందులు వాడేలా ప్రోత్సహించాలని సూచించారు. హైపర్‌టెన్షన్ రోగులకు ఏ సమయంలో ఏమందులు వాడాలో ప్రోటోకాల్ ప్రకారం వాడేలా చూడాలని, క్యాన్సర్ రోగస్తులు ఉన్నట్లయితే వారిని గుర్తించి ఆన్‌లైన్‌లో న మోదు చేయాలని తెలిపారు. తదుపరి చికిత్స కొరకు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి పంపేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతీనెలా 30 సంవత్సరాలు పైబడిన వారందరికి బీపీ, గ్లూకోజ్ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ఇంద ల్వాయి ప్రా థమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గన్నా రం ఆరోగ్య ఉపకేంద్రాన్ని పరిశీలించి రోగులకు అందుతున్న సేవల గురించి ఆరా తీశారు.ప్రతీఆరోగ్య కేంద్రంలో వ్యా ధుల రిజిస్టర్ తప్పక ఉండాలని, మం దుల స్టాక్ రిజిస్టార్ ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలని తెలిపారు. ఆరోగ్య కేంద్రంలో అందజేస్తున్న సేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.ఈకార్యక్రమంలో జిల్లా అసంక్రమిక వ్యాధుల ప్రాజెక్టు అధికారి డాక్టర్ వినిత్,జిల్లా క్షయవ్యాధి నియంత్రణ అధికారి డాక్టర్ సంతోష్, అసంక్రమిక వ్యాధుల సూపర్‌వైజర్ ఊహశ్రీ,కోఆర్డినేటర్ వెంకటేశ్, సురేష్, శంకర్, ఆనంద్, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్మితా సబర్వాల్ బహిరంగ క్షమాపణ చెప్పాలి



నగరంలో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న దృశ్యం

సుభాష్‌నగర్, జూలై 25: వికలాంగులపై స్మితాసబర్వాల్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో స్మిత సబర్వాల్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ మాట్లాడుతూ సోషల్ మీడియాలో సీనియర్ ఐఏఎస్ అధికారిని స్మితాసబర్వాల్ వికలాంగులకు సివిల్ సర్వీసెస్‌లో రిజర్వేషన్లు ఎందుకని వ్యాఖ్యానించడం తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే శక్తి వికలాంగులకు ఉండదా అని ప్రశ్నించారు. స్మితాసబర్వాల్ వికలాంగుల సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కనక ప్రమోద్ మాట్లాడుతూ స్మితాసబర్వాల్‌ను విధుల నుంచి వెంటనే తప్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సరికెల పోశెట్టి, గంగాధర్, భూమయ్య, ప్రవీణ్, యమున, సత్తెక్క, తదితరులు పాల్గొన్నారు.

రైళ్ల రద్దు పొడగింపు

ఖిల్లా, జూలై 25: హైదరాబాద్ డివిజన్ పరిధిలో పలు చోట్ల జరుగుతున్న మరమ్మతు పనుల కారణంగా పలు రైళ్లను రద్దు చేశారు. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే శాఖ నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. రద్దు కానున్న రైళ్ల వివరాలను వారు ప్రకటించారు. అందులో భాగంగా జిల్లా మీదుగా నడిచే బోధన్-కాచీగూడ రైలుతో పాటు నిజామాబాద్-కాచిగూడ మధ్య నడిచే డెమో ఫాస్ట్ ప్యాసింజర్ రైళ్లను రద్దు చేశారు. ఈ రద్దు ఆగస్టు 1 నుంచి 31 వరకు కొనసాగుతాయని ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ప్రయాణాలపై ప్రజలు, ప్రయాణికులు దృష్టిసారించాలని రైల్వే అధికారులు తెలిపారు.

చికెన్ ధరలు





రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.100	రూ.220	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	రూ.105	రూ.225	రూ. 245

బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.71200	రూ.65,600	రూ.870

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : డెడ్‌పూల్ (తెలుగు 3డీ) (10.15, 1.15)
: డెడ్‌పూల్ (ఇంగ్లీష్ 3డీ) (4.15, 7.15, 10.15)
స్క్రీన్-2 : కల్కి (3డీ తెలుగు) (11.20, 6.15)
: రాయాన్ (3.05, 10.00)
స్క్రీన్-3 : బ్యాడ్ న్యూజ్ (హిందీ) (10.00, 4.15, 10.30)
: పురుషోత్తముడు (1.05)
: ఆపరేషన్ రావన్ (7.20)
స్క్రీన్-4 : రామ్ ఎన్‌ఆర్‌ఐ (10.10)
: గల్లీ గ్యాంగ్ స్టార్స్ (1.00)
: ట్విస్టర్స్ (ఇంగ్లీష్) (4.20)
: రాయన్ (7.10)
: పురుషోత్తముడు (10.20)



ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : రాయన్ (10.45, 1.35, 4.30, 7.25, 10.20)
స్క్రీన్-2 : పురుషోత్తముడు (10.40)
: కల్కి (తెలుగు) (4.15, 10.20)
: డెడ్‌పూల్ (తెలుగు 3డీ) (1.40, 7.30)
స్క్రీన్-3 : డెడ్‌పూల్ (తెలుగు 3డీ) (10.40, 10.40)
: కల్కి (1.20)
: డెడ్‌పూల్ (ఇంగ్లీష్ 3డీ) (4.45)
: పురుషోత్తముడు (7.30)

దేవి : రాయన్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : డెడ్‌పూల్ (తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : కల్కి (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్